E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 04-01-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక: 04|| పేజీలు–6 www.ekaburu.com



ఆర్‌బీఐ భరోసా+8% వడ్డీ.. ఈ బాండ్ల గురించి తెలుసా? » 4లో

వైభవ్ విఫలమైనా.. టీమిండియా భారీ స్కోర్ » 6లో



అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1000 కోట్ల ఎన్‌సీడీ ఇష్యూ » 4లో



పిల్లలకు మంచి అలవాట్లు మనమే నేర్పాలి: » 5లో



దుమ్ము లేపుతుంది » 5లో





యెమెన్‌లో మళ్లీ అంతర్యుద్ధం » 3లో

## మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం ఖరారు



- ఎన్నికలకు ప్రధాన పార్టీలు సన్నద్ధం
- ఈనెల 11 లేదా 20న నోటిఫికేషన్ విడుదల
- దీనికి తగ్గట్టుగా ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కసరత్తు
- ముగిసిన 117 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం నిర్ణయం
- ఇప్పటికే జనవరి 1న ఎన్నికల సంఘం, ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- తుది జాబితా ఈ నెల 10న విడుదల

(ఈ కబురు, హైదరాబాద్)

తెతెలంగాణ రాష్ట్రంలో మరో ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం ఖరారు అయింది. పంచాయితీ ఎన్నికలు పూర్తి కావటం తో ఇక మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెలలోనే షెడ్యూల్ విడుదల,ఆ తరువాత ఎన్నికల నిర్వహణ దిశగా ప్లానింగ్ జరుగుతోంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల పైన సర్వేలు పూర్తయ్యాయి. ఏ పార్టీ వైపు ప్రజలు ఆసక్తిగా ఉన్నారో అంచనాలు వెల్లడవుతున్నాయి. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల దిశగా కసరత్తు జరుగుతోంది. ఈ నెల 11 లేదా 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్లుగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలుపెట్టాయి. గడువు ముగిసిన 117 మున్సిపాలిటీ పాలక వర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇప్పటికే ఎన్నికల సంఘం జనవరి 1న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది. ఈ నెల 10న తుది జాబితా వెలువరిస్తుంది. దీంతో ఈ నెల 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఒకవేళ సంక్రాంతి పండగ, సెలవుల కారణంగా కుదరకపోతే 20న విడుదల చేస్తారని సమాచారం. రాష్ట్రంలో ఇప్పటికే 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లకు జనవరితోనే పాలన గడువు ముగిసింది.

తరువాయి 2లో



## భారీ ఎన్‌కౌంటర్...

## 12 మంది మావోయిస్టులు హతం

» కీలక నేత మృతి

» భారీగా ఆయుధాలు, ప్రేలుడు పదార్థాలు స్వాధీనం

ఈ కబురు చత్తీస్ గడ్:

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న పక్కా సమాచారంతో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్,సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్నాయి. శనివారం ఉదయం బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం జరిగిన ఈ భీకర ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు హతమవ్వగా,మృతుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నేత కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మంగడుపై గతంలోనే ప్రభుత్వం భారీ రివార్డును కూడా ప్రకటించింది.

తరువాయి 2లో

## దశాబ్దకాలం తర్వాత తెలంగాణలో

## దక్కిన విజయం ఇది



- స్థానిక సంస్థల్లో మీరు వేసిన అడుగు చాలా పెద్దది
- పంచాయతీల నుంచి మన అభివృద్ధి ప్రస్థానం మొదలుపెడదాం
- తెలంగాణకు బలమైన యువ నాయకత్వం అవసరం ఉంది
- మీ విజయం బలమైన మార్పుకి నాంది కావాలి
- తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులతో సమావేశంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

(ఈ కబురు, హైదరాబాద్) :తెలంగాణ ప్రజలకు కొత్త నాయకత్వం కావాలి. పంచాయతీల నుంచి మన అభివృద్ధి ప్రస్థానం మొదలుపెడదాం. సర్పంచులు, వార్డు మెంబర్లుగా విజయం సాధించి.. మీరంతా చాలా పెద్ద అడుగు వేశారు. ఎంత పెద్ద ప్రయాణం అయినా ఒక్క అడుగుతోనే మొదలు పెడతాం. ఈ రోజు మీరు వేసిన అడుగు సరికొత్త మార్పుకు నాంది కావాలని కోరుకుంటున్నాన"ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పోటీ చేసిన సంఖ్యలో 50 శాతం విజయం సాధించడం అభినందనీయమన్నారు. జనసేన పార్టీ మద్దతుదారులుగా విజయం సాధించిన ప్రతి ఒక్కరూ మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం కొండగట్టు పర్యటనలో భాగంగా ఇటీవల తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున సర్పంచులు, వార్డు మెంబర్లుగా విజయం సాధించిన అభ్యర్థులు, బరిలోకి దిగిన అభ్యర్థులతో సమావేశమయ్యారు.

తరువాయి 2లో

## పొగమంచులో అప్రమత్తంగా ఉండండి

## సైబరాబాద్ పోలీసులు

» వాహనదారులకు కీలక సూచనలు చేసిన పోలీసులు



ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణపై చలి పులి పంజా విసురుతుంది. దాంతోపాటే పొగ మంచు దట్టంగా కమ్మేస్తుంది. పొగమంచు కారణంగా గత రెండు రోజులుగా రాష్ట్రంలోని జాతీయ రహదారులపై భారీ ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోతుందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. శీతాకాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ప్రజలు, వాహనదారులకు సైబరాబాద్ పోలీసులు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా పాదాచారులు, ద్విచక్రవాహనదారులకు అప్రమత్తతే రక్ష అని తెలిపారు. దీంతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు హైవేలపై ప్రయాణించే కార్లు, భారీ వాహనదారులకు అధిక జాగ్రత్త అవసరమని సూచించారు.

తరువాయి 2లో

## తెలంగాణకు అన్యాయం జరగనివ్వను

– సీఎం రేవంత్‌రెడ్డి



ఈ కబురు, హైదరాబాద్:
గోదావరి - బనకచర్లకు 2016లో కేసీఆర్ హయాంలోనే పునాది పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభలో 'నీళ్లు-నిజాలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం మాట్లాడారు. "గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయి.. వాడుకోవాలని జల్‌శక్తిశాఖ భేటీలో కేసీఆర్ అన్నారు. ఆయన చెప్పిన మాటలతోనే చంద్రబాబు బనకచర్ల ఆలోచన చేశారు. కేంద్ర జల్‌శక్తిశాఖ నిర్వహించిన సమావేశానికి రెండు సార్లు కేసీఆర్ వెళ్లారు.

తరువాయి 2లో



ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా'.. కాంగ్రెస్ 'పీపీటీ'లపై ప్రశాంత్‌రెడ్డి విమర్శలు తరువాయి 3లో



సంఘ విద్రోహ శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతోంది తరువాయి 2లో



గెలిచినప్పుడు నోరు మెదపరే... తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# దశాబ్దకాలం తర్వాత తెలంగాణలో దక్కిన విజయం ఇది



పార్టీ నుంచి గెలుపొందిన ప్రతి అభ్యర్థికి పేరు పేరునా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున విజయం సాధించారు. మీరు మొదలుపెట్టిన ప్రయాణం కీలకమైనది. నేను పార్టీ పెట్టడానికి నాలో చైతన్యం నింపింది, నాకు ధైర్యం ఇచ్చింది తెలంగాణ నేల. నాకు తెలంగాణ పోరాట స్ఫూర్తి అంటే చాలా ఇష్టం. నేను ఇక్కడి నుంచి ఏమీ ఆశించడం లేదు. మన దేశం, మన తెలుగు నేలకు జనసేన పార్టీ తరఫున చేయగలిగిన సేవ కలసికట్టుగా చేద్దాం. తెలంగాణలో పుట్టిన పార్టీ మనది. ఇక్కడ ప్రజలకు అండగా నిలుద్దాం.

**––తెలుగు ప్రజల ఐక్యత కోసం కలిసి పని చేద్దాం**

తెలంగాణకు బలమైన యువ నాయకత్వం అవసరం ఉంది. మీ స్థాయి, మీ ప్రాంతాన్ని బట్టి పోరాటం చేయండి. మీరంతా సైద్ధాంతిక బలంతో సహజంగా ఎదగాలని కోరుకుంటున్నాను. ఒక సిద్ధాంతం ఆధారంగా ఎదిగిన వారిని విభేదించడం కష్టం. అది నేను ప్రాక్టికల్ గా చేసి చూపాను. రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలు విభిన్నంగా ఉంటాయి. తెలంగాణ నేల నాకు పోరాట శక్తి ఇచ్చింది. రాజకీయాల్లో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకున్నాను అంటే తెలంగాణ అమరవీరులు ఇచ్చిన స్ఫూర్తే కారణం. రజాకార్ల మీద వారు చేసిన సుదీర్ఘ పోరాటం నుంచి ఎంతో స్ఫూర్తి పొందాను. సమయం ఇవ్వగలిగితే రాజకీయాల్లో మంచి స్థాయికి చేరుకోవచ్చు. 53 మంది విజయం సాధించారు. దశాబ్ద కాలం తర్వాత తెలంగాణలో దక్కిన విజయం ఇది. మీ అందరికీ ఆ కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉండాలి. అందరికీ మంచి భవిష్యత్తు ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాలూ క్షేమంగా ఉండాలి. తెలుగు రాష్ట్రాల ప్రజల ఐక్యత కోసం కలసి పనిచేద్దాం" అన్నారు. ఈ సమావేశంలో పార్టీ తెలంగాణ ఇంఛార్జ్, టీటీడీ ఎల్.ఎ.సి. ఛైర్మన్ శంకర్ గౌడ్, పార్టీ ఉపాధ్యక్షులు, టీటీడీ బోర్డు మెంబర్ బి. మహేందర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, ఆర్. కె. సాగర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు అన్యాయం జరగనివ్వను



కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు కేసీఆర్ అంగీకరించారు. కృష్ణా ట్రైబ్యునల్ తుదితీర్పు వచ్చే వరకు దీనికే కట్టుబడి ఉంటామని సంతకం పెట్టారు. వాటా పెంపు కోసం 2020లో మరోసారి అవకాశం వస్తే కూడా కేసీఆర్ ఉపయోగించుకోలేదు.

**––నా ప్రాంతం ముఖ్యమని.. సొంత పార్టీని కాదని బయటికొచ్చా**

నాకు నా ప్రాంతమే ముఖ్యం. ఆ తర్వాతే పార్టీ అని నాడు బయటకొచ్చా. సీఎం కుర్చీలో ఉండి తెలంగాణకు అన్యాయం జరిగేలా ప్రవర్తించను. మేం అధికారంలోకి వచ్చాక రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపించిన చరిత్ర నాది. దానిని ఆపితేనే చర్చలకు వస్తామని కండీషన్ పెట్టాం. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ఆగిందో లేదో.. నిజనిర్ధారణ కమిటీ ద్వారా విచారణ చేయించుకోవచ్చు. చచ్చినా.. బతికినా.. తెలంగాణ కోసమే. ఇదే నా కమిట్‌మెంట్. దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నా.. తెలంగాణకు అన్యాయం జరగనివ్వను'' అని తెలంగాణ సీఎం రేవంత్ అన్నారు.

# సంఘ విద్రోహ శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతోంది



**––కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన**

**ఈ కబురు, ఉదయ్‌పుర్:** సంఘ విద్రోహ, దేశ వ్యతిరేక శక్తుల్లో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న ధోరణి ఆందోళన కలిగిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలో వైట్ కాలర్ ఉగ్రవాదం అధికమవుతోందని తెలిపారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో భూపాల్ నోబుల్స్ విశ్వవిద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో శుక్రవారం రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. గతేడాది నవంబరు 10న దిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడును ప్రస్తావిస్తూ వైట్ కాలర్ ఉగ్రవాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. జ్ఞానంతో పాటు విలువలు, నైతికత ఎంత అవసరమో ఆ ఘటన తెలియజేస్తుందని చెప్పారు. రోగులకు ప్రిస్క్రిప్షన్ రాసే వైద్యుల చేతుల్లో ప్రమాదకర పేలుడు పదార్థాలు ఉండటం దురదృష్టకరమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. దేశంలోని డిఫెన్స్ స్టార్టప్‌లు అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నాయని చెప్పారు. రాబోయే 15 ఏళ్లలో ఆయుధాల తయారీలో భారత్ పూర్తి స్వయం సమృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**––ఆత్మాభిమానం అహంకారంగా మారకూడదు**

ఆత్మాభిమానం చాలా ముఖ్యమని దానిని ఎప్పుడూ అహంకారంగా మారనివ్వరాదని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. "ఆత్మాభిమానం, అహంకారం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. విద్యార్థులు తమ జీవితంలో అహంకారానికి చోటునివ్వకూడదు" అని హితవుపలికారు.

# మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం ఖరారు

మొదటి పేజీ తరువాయి



అప్పటి నుంచి అవి ప్రత్యేక అధికారుల పాలనలో నడుస్తున్నాయి. ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్లు, మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లోని 2 మున్సిపాలిటీల పాలక వర్గాలకు ఏప్రిల్ వరకు గడువు ఉండటంతో మినహాయింపు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇక జీహెచ్ఎంసీకి వచ్చే ఫిబ్రవరి, మిగిలిన వాటికి మే నెల వరకు గడువు ఉంది. ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేసిన విషయం తెలిసిందే. ఇవి కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రచురించాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆయా కమిషనర్లు, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి, కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అటు ప్రధాన పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో ఎవరికి కలిసి వస్తుందనేది సర్వేలు చేయిస్తున్నాయి. సర్వే నివేదికలు తమకే అనుకూలంగా ఉన్నాయని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. దీంతో, ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటం ఖాయంగా కనిపిస్తోంది.

# బస్ డ్రైవర్ నుంచి అధ్యక్షుడి వరకు.. 'మదురో ప్రస్థానం' ముగిసినట్లేనా?

**ఈ కబురు, డెస్క్:**
తమ దేశంలో మాదక ద్రవ్యాల సరఫరా, హింసను ప్రేరేపించేందుకు నికొలస్ మదురో నేతృత్వంలోని వెనెజువెలా ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆ దేశంపై భీకర దాడులు చేపట్టారు. అధ్యక్షుడు మదురోతోపాటు ఆయన సతీమణి సీలియా ఫ్లోరెస్‌ని తమ కస్టడీలోకి తీసుకున్నట్లు ప్రకటించారు. దీంతో మదురో ప్రభుత్వాన్ని కూల్చాలన్న తన సంకల్పాన్ని ట్రంప్ దాదాపుగా నెరవేర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బస్సు డ్రైవర్ నుంచి దేశాధ్యక్షుడి వరకు ఎదిగి.. దశాబ్దానికిపైగా వెనుజువెలాను పాలించిన మదురో ప్రస్థానం ఇక ముగిసినట్లేనని కనిపిస్తోంది.

**––ఎవరీ మదురో..?**

కారకస్‌లో 1962లో జన్మించిన మదురో.. బస్సు డ్రైవర్‌గా తన ఉద్యోగ జీవితాన్ని మొదలుపెట్టారు. ఆ తర్వాత యూనియన్ నేతగా ఎదిగారు. హ్యూగో చావెజ్ నేతృత్వంలోని యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనెజువెలా (PSUV) చేరిన మదురో కీలక బాధ్యతలు చేపట్టారు. చావెజ్ ప్రభుత్వంలో 2006 నుంచి 2013 వరకు విదేశాంగ మంత్రిగా పనిచేశారు. లాటిన్ అమెరికా కరేబియన్ (ఏఎల్‌బీఏ) కూటమి ఏర్పాటులో కీలక పాత్ర వహించారు. 2012లో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన.. 2013లో చావెజ్ మరణంతో తాత్కాలిక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. అనంతరం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో గెలుపొందిన ఆయన.. ఇప్పటివరకు అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. అయితే, ఆయా ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన సతీమణి సీలియా ఫ్లోరెస్ న్యాయవాది. అటార్నీ జనరల్‌గా పనిచేసిన ఆమె.. మొదటి భర్తతో విడాకుల తర్వాత మదురోను వివాహం చేసుకున్నారు.

**––మదురోను అమెరికా ఎందుకు టార్గెట్ చేసింది?**

తమ దేశానికి వెనుజువెలా వలసలను ప్రోత్సహిస్తోందని, నార్కో టెర్రరిజానికి పాల్పుతోందనేది ట్రంప్ ప్రధాన ఆరోపణ. ఆ దేశంలోని జైళ్లు, పిచ్చాసుపత్రులను ఖాళీ చేయించి మరీ వారిని బలవంతంగా అమెరికాకు వెళ్లేలా మదురో ప్రోత్సహిస్తున్నారనేది ట్రంప్ ఆరోపించగా.. మదురో ప్రభుత్వం ఖండించింది. దీనికితోడు అమెరికాకు పెద్దఎత్తున మాదక ద్రవ్యాల రవాణాకు కూడా వెనుజువెలానే కారణమని ట్రంప్ చేస్తున్న మరో ఆరోపణ. వెనుజువెలాకు చెందిన రెండు డ్రగ్ ముఠాలకు మదురోనే నాయకుడని ట్రంప్ పలుమార్లు విమర్శించారు.

**––చమురుపై అసలు కన్ను..**

ప్రపంచంలోనే అత్యధికంగా చమురు నిల్వలు కలిగిన దేశాల్లో వెనెజువెలా ఒకటి. 2014 తరవాత వీటి ధరలు పతనం కావడానికి తోడు అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలవల్ల తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో ఆకలికేకలు మిన్నంటాయి. ఈ క్రమంలో ఇక్కడి చమురుపై ఆధిపత్యం చెలాయించాలనుకుంటున్న ట్రంప్ సర్కార్.. ఇందుకోసం కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోంది. అందుకే అమెరికాకు డ్రగ్స్ సరఫరాలో మదురో ఉన్నాడని ఆరోపిస్తూ.. ప్రభుత్వం నుంచి దిగిపోవాలని హెచ్చరిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే దేశాధ్యక్షుడిని అరెస్టు చేసేందుకు సహకరిస్తే 50 మిలియన్ డాలర్ల (ప్రస్తుతం రూ.450 కోట్లు) రివార్డు అందిస్తామని కొంతకాలం క్రితం ఆఫర్ చేసింది. అంతేకాదు వెనుజువెలా ప్రతిపక్ష నేత కొరినా మచాడోకు, ట్రంప్‌నకు మధ్య రాజకీయంగా సన్నిహిత సంబంధాలు కూడా ఉన్నాయి. ట్రంప్ చర్యలకు ఆమె బహిరంగంగానే మద్దతు ఇచ్చారు. ఇటీవల నోబెల్ శాంతి బహుమతి ఆమెకు వచ్చిన సమయంలో వారిద్దరూ ఫోన్‌లో సంభాషించుకున్నారు. ఈ క్రమంలోనే నేరుగా రంగంలోకి దిగిన ట్రంప్ సైన్యం.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి మదురోను కస్టడీలోకి తీసుకోవడం గమనార్హం.



మొదటి పేజీ తరువాయి

## ఓడినప్పుడు ఈవీఎంల తప్పంటున్నవారు..

# గెలిచినప్పుడు నోరు మెదపరే



**–మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**


ఈ కబురు, దిల్లీ:
ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లోని ఎన్నికల ప్రక్రియను వేలెత్తి చూపడం సరికాదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హితవు పలికారు. ఓడితే ఈవీఎంల తప్పు అంటున్న కొంతమంది అదే ఈవీఎంల ద్వారా గెలిచినప్పుడు మాత్రం తప్పుబట్టడం లేదని వ్యాఖ్యానించారు. శుక్రవారం సింగపూర్‌లో 'శ్రీ సాంస్కృతిక కళా సారథి' సంస్థ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కుటుంబంలో, సమాజంలో, దేశంలో ఐక్యత ఉన్నప్పుడే ప్రపంచం ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో మనం ఐక్యంగా లేకపోవడం వల్లే చిన్నచిన్న దేశాలు కూడా వచ్చి, మనల్ని ఆక్రమించి సంపదను దోచుకెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల వరకే ప్రత్యర్థులు, తర్వాత అందరం భారతీయులం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. భారత ఆర్థిక వ్యవస్థపై అవాంఛిత వ్యాఖ్యలు చేసే వారికి మన అభివృద్ధి ద్వారా ప్రధాని మోదీ తగిన సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

# భారీ ఎన్‌కౌంటర్...

## 12 మంది మావోయిస్టులు హతం

మొదటి పేజీ తరువాయి





అతని మరణం మావోయిస్టు పార్టీకి ఈ ప్రాంతంలో పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి భద్రతా బలగాలు అత్యాధునిక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఏకే-47 రైఫిల్స్, ఇన్సాస్ రైఫిల్స్, పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యాన్ని బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో మరికొంత మంది మావోయిస్టులు తప్పించుకున్నట్లు అనుమానిస్తున్న బలగాలు, పరిసర ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి. కాల్పులు జరిగిన ప్రాంతంలో భారీగా రక్తం మడుగులు ఉండటంతో, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవలి కాలంలో మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో భద్రతా బలగాలు సాధించిన అతిపెద్ద విజయాల్లో ఇది ఒకటిగా నిలిచింది.

# శేరిలింగంపల్లిలో అత్యంత పటిష్టంగా బీఆర్ఎస్ పార్టీ : కొమిరిశెట్టి సాయిబాబా

**బీఆర్ఎస్ లో చేరిన ఇతర పార్టీల నాయకులు**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ పార్టీ అత్యంత పటిష్టంగా ఉందని, బూత్ స్థాయి నుంచి పటిష్టమైన కార్యకర్తల బలం పార్టీకి ఉందని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లికి చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు రాగం జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో కొమిరిశెట్టి సాయిబాబా సమక్షంలో శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారికి సాయిబాబా బీఆర్ఎస్ కండువాలతో ఆహ్వానించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో మరోసారి గులాబీ గులాబీ జెండాను రెపరెపలాడించేందుకు నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలతో పాటు భవిష్యత్తులో వచ్చే ఏ ఎన్నికలోనైనా బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజలు మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాగం జంగయ్య యాదవ్,, రాజు ముదిరాజ్, దారుగుపల్లి నరేష్, రాము, పరశురామ్, ప్రవీణ్, నర్సింగ్, లడ్డు, శివ, హేమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని టీఆర్ఎస్ కండువాలతో ఆహ్వానిస్తున్న సాయిబాబా



నూతనంగా పార్టీలో చేరిన వారితో సాయిబాబా, బిఆర్ఎస్ నాయకులు

# వెనెజువెలా అధ్యక్షుడు మదురో మా కస్టడీలోనే: ట్రంప్

**ఈ కబురు, డెస్క్:**

అమెరికా వెనెజువెలా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెల కొన్నాయి. యూఎస్ సైన్యం శనివారం తెల్లవారు జామున వెనెజువెలా రాజధాని కరాకస్‌పై భీకరదాడులు జరిపిన సంగతి తెలిసిందే. వాటిని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ధ్రువీకరించారు. అలాగే ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి తమ కస్టడీలో ఉన్నారని వెల్లడించారు.



వారిద్దరిని వెనెజువెలా వెలుపలకు తరలించినట్లు వెల్లడించారు. దీనిపై అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నామని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టు చేశారు. అమెరికా సైన్యానికి చెందిన డెల్టా ఫోర్స్ ఈ ఆపరేషన్‌లో భాగమైంది.

**——వారి ఆధారాలు ఇవ్వండి: ఉపాధ్యక్షుడు**

తమ అధ్యక్షుడిని అమెరికా కస్టడీలోకి తీసుకోవడంపై వెనెజువెలా ఉపాధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్ స్పందించారు. మదురో, ఆయన సతీమణి ఇప్పుడు ఎక్కడున్నారో తమకు తెలియదని చెప్పారు. వారు సజీవంగా ఉన్నారని తెలియజేసేలా ఆధారాలు ఇవ్వాలని అమెరికాను డిమాండ్ చేశారు. 1989 తర్వాత ఒక లాటిన్ అమెరికన్ దేశంలో అమెరికా నేరుగా జోక్యం చేసుకోవడం ఇదే తొలిసారి. ఆ ఏడాది పనామాపై దాడిచేసి, మిలిటరీ నేత మాన్యుయెల్ నోరిగాను పదవీచ్యుతుడిని చేసింది. ఈ పరిణామాల వేళ వెనెజువెలా పక్కదేశమైన కొలంబియా అప్రమత్తమైంది. ఆ దేశ సరిహద్దుల్లో బలగాలను మోహరించింది.

**——ఇక సైనిక దాడులు చేయబోం: అమెరికా**


మదురో అమెరికా కస్టడీకి చిక్కడంతో వెనెజువెలాలో తమ సైనిక చర్య పూర్తయిందని యూఎస్ సెనెటర్ మైక్ లీ వెల్లడించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను ఉటంకిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అమెరికా ఈ దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే తమ చమురు కోసమే అమెరికా దాడులు చేయనుందని గతంలో వెనెజువెలా ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా.. గతంలోనే తాను దేశాన్ని వీడేందుకు సిద్ధమని మదురో చెప్పినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. తాను, తన కుటుంబంతో సహా దేశాన్ని వీడేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే తనకు, తన కుటుంబానికి ఆంక్షల నుంచి పూర్తి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారని వాటి సారాంశం. యూఎస్ విధించిన అన్ని ఆంక్షలను ఎత్తివేయడంతో పాటు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి తాను ఎదుర్కొంటున్న కేసులను మూసివేయడం వంటి వాటి గురించి వాషింగ్టన్ వద్ద ప్రస్తావించినట్లు వెల్లడించాయి

# పొగమంచులో అప్రమత్తంగా ఉండండి : సైబరాబాద్ పోలీసులు

మొదటి పేజి తరువాయి

## పోలీసుల సూచనలు..






- పాదచారులు పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో రోడ్లపైకి రాకపోవడం ఉత్తమం. అవసరమైతే మాత్రమే బయటకి రావడంతో పాటు రోడ్లను దాటేటప్పుడు రెండు వైపులా చూసి జాగ్రత్తగా రోడ్డు దాటాలి.
- పొగమంచు అధికంగా ఉన్న సమయంలో నల్లటి లేదా మసక బట్టలు ధరిస్తే వాహన డ్రైవర్లు మిమ్మల్ని గమనించలేరు కాబట్టి కాంతివంతమైన దుస్తులు ధరించాలి.
- ద్విచక్రవాహనదారులు పొగమంచులో వేగంగా వెళ్ళకుండా, నెమ్మదిగా ముందుకు సాగాలి.
- హెడ్‌లైట్స్, ఫాగ్ లైట్లు, టెయిల్ లైట్లు పరిశుభ్రంగా ఉంచి సరిగ్గా ఆన్ చేయండి.
- వాహనాల మధ్య కనీస సురక్షిత దూరం పాటించడంతో పాటు బ్రేక్ ఒక్కసారిగా కాకుండా సాఫీగా వాడాలి.
- మూల మలుపులు, లైన్ మార్చే ముందు తప్పనిసరిగా ఇండికేటర్స్ ఆన్ చేయాలి.
- రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించడంతో పాటు హెల్మెట్ వైజర్ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వాహన రిఫ్లెక్టర్లు స్పష్టంగా ఉంచుకోవాలి.
- డ్రైవింగ్ సమయంలో రెండు చేతులతో స్టీరింగ్ పట్టుకోవడంతో పాటు డ్రైవింగ్ సమయంలో మొబైల్ లేదా ఇతర దృష్టి మళ్లించే పనులు చేయవద్దు.
- వాహనాలకు గ్రిప్ ఉన్న టైర్లు వాడడంతో పాటు టార్చ్, రిఫ్లెక్టర్లు, అవసరమైన టూల్స్‌తో ఎమర్జెన్సీ కిట్ సిద్ధంగా ఉంచుకోవాలి.
- విండ్ షీల్డ్ పరిశుభ్రంగా ఉంచి డిఫాగర్ / యాంటీ ఫాగ్ మోడ్ ఉపయోగించాలి.
- టూ-వీలర్ వాహనదారులు ఉదయం వేళ వేగంగా వెళ్ళకూడదు.
- రోడ్లలో అడ్డంకులు, వంపులు, జంక్షన్లు ఎదురైతే వెంటనే వాహన వేగాన్ని తగ్గించండి.
- పొగమంచు ప్రభావిత ప్రాంతాల్లో ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ పోలీసుల సూచనలను ఖచ్చితంగా పాటించాలి.
- ఒక్కసారిగా వేగ నియంత్రణ మార్పులు చేయకుండా,వాహన వేగాన్ని నెమ్మదిగా పెంచడం లేదా తగ్గించాలి.
- భారీ వాహనాలు రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు వేసుకోవడంతో పాటు హెడ్ లైట్లు, టెయిల్ లైట్లు ఎప్పుడూ ఆన్‌లో ఉంచాలి.
- ఔటర్ రింగు రోడ్డు, హైవేల్లో పొగమంచు తీవ్రంగా ఉండే సమయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఎమర్జెన్సీ సమయంలో ఎడమ వైపు లేన్‌లో వాహనాన్ని నిలపాలి.
- పొగమంచులో గ్రామీణ రహదారులపై ప్రయాణించే సమయంలో స్థానికంగా సంచరించే జంతువులపై అప్రమత్తంగా ఉండాలి.

మొదటి పేజి తరువాయి

# ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా'.. కాంగ్రెస్ 'పీపీటీ'లపై ప్రశాంత్‌రెడ్డి విమర్శలు



ఈ కబురు, హైదరాబాద్:

గతంలో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో పీపీటీ ఇస్తే కాంగ్రెస్ నేతలు రాలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పీపీటీ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధమని కాంగ్రెస్ నేతలు అప్పుడు లేఖలు రాశారని గుర్తుచేశారు. ఆ లేఖలో ఉత్తమ్, భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని పేర్కొన్నారు. ఇప్పుడేమో మంత్రి ఉత్తమ్ పీపీటీ ప్రజెంటేషన్ ఇస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌కు పీపీటీ అవకాశం ఇవ్వాలని కోరితే బీఏసీలో తిరస్కరించారన్నారు. మంత్రి ఉత్తమ్ పీపీటీ ఇస్తే.. తమకూ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**--కాంగ్రెస్ అనైతిక విధానాలు: హరీశ్‌రావు**

కాంగ్రెస్ ప్రభుత్వం అనైతిక విధానాలు అవలంబిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సంప్రదాయాలు అంటూ నీతులు చెప్పిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. "అసెంబ్లీలో ప్రజెంటేషన్ ఇస్తే సభకు హాజరుకాబోమని గతంలో ఉత్తమ్ చెప్పారు. ఆడియో, విజువల్ ప్రజెంటేషన్ ఇవ్వడం సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. ఇప్పుడేమో ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధపడ్డారు" అని అన్నారు.

# యెమెన్‌లో మళ్లీ అంతర్యుద్ధం



**——సౌదీ, యూఏఈల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు**

**ఈ కబురు, నెట్‌వర్క్;**

**యెమెన్‌లో తాజా ఘర్షణలు పశ్చిమాసియాలో రెండు శక్తిమంతమైన దేశాలైన సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. నిన్న మొన్నటివరకు ఒకే తాటిపై ఉన్న ఈ రెండు దేశాలు ప్రస్తుతం యెమెన్‌లో చెరో వర్గానికి మద్దతుగా నిలిచాయి. దీంతో కొన్నాళ్లుగా ఘర్షణలకు దూరంగా ఉన్న ఆ దేశం మళ్లీ అంతర్యుద్ధం ముంగిట నిలబడింది.**

**——ఘర్షణకు బీజాలు పడ్డాయిలా..**

యెమెన్‌లో అంతర్యుద్ధం 2014లో ప్రారంభమైంది. ఆ యుద్ధంలో కీలక సనా నగరాన్ని హూతీ తిరుగుబాటుదారులు ఆక్రమించడమే కాదు.. దేశంలో ఉత్తర భాగాలను తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. దక్షిణ, తూర్పు యెమెన్‌లను అంతర్జాతీయ గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వం (ఐఆర్‌జీ) పాలిస్తోంది. ఆ పాలక మండలిలో సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్(ఎస్టీసీ) కీలక భాగస్వామి ఇప్పుడు ఆ భాగస్వామే.. స్వతంత్ర దక్షిణ యెమెన్ ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు కదలడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. డిసెంబరు నుంచి ఎస్టీసీ కీలక ప్రాంతాలను ఆక్రమించడం ప్రారంభించింది. ఆ నెల రెండో వారంలోనే హద్రమౌత్, అల్‌మరాహ్ సహా పలు ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకుంది. ఇంధన వనరులు అధికంగా ఉన్న ఈ భూభాగాలను ఆక్రమించడంతో ఒక్కసారిగా యెమెన్‌లో అలజడి రేగింది.

**——ఎవరెటువైపు..?**

యెమెన్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తోంది. దక్షిణ యెమెన్‌ను స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ఎస్టీసీకి యూఏఈ అండగా నిలబడింది. వాస్తవానికి హూతీలకు వ్యతిరేకంగా ఉన్న గ్రూపులన్నింటిని సౌదీ, యూఏఈలే ఏకం చేశాయి. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఎస్టీసీకి యూఏఈ అండగా నిలిచింది. మరోవైపు యెమెన్ సమైక్యంగా ఉండాలన్న సౌదీ భావన. ఎస్టీసీ దాడులతో హూతీలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం బలహీనమవుతుందని చెబుతోంది. పైగా తమ దేశ సరిహద్దులకు దగ్గరగా ఉన్న ప్రాంతాలను ఎస్టీసీ ఆక్రమించడం.. తమ దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా భావిస్తోంది. అందుకే తూర్పు భూభాగాల నుంచి వైదొలగాలని గత నెల 25న ఎస్టీసీకి హెచ్చరిక జారీ చేసింది. దీన్ని ఆ సంస్థ పట్టించుకోకపోవడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది.

**——అందుకే దాడి**

ఎస్టీసీకి ఆర్థిక సాయమే కాదు.. ఆయుధ సాయమూ యూఏఈ చేస్తోందన్నది సౌదీ అరేబియా ఆరోపణ. అందులో భాగంగానే ఓ నౌక ఆయుధాలతో యూఏఈ నుంచి బయల్దేరి యెమెన్‌లో ముకల్లా ఓడరేవుకు చేరుకుందని పేర్కొంటూ గత నెల 28న భారీస్థాయిలో తమ యుద్ధ విమానాలను రంగంలోకి దింపింది. ముకల్లాపై వైమానిక దాడులు నిర్వహించింది. తర్వాత సౌదీ మద్దతుతో యెమెన్ ఓ కీలక ప్రకటన చేసింది. తమ దేశంలో ఉన్న సైనికులను యూఏఈ 24 గంటల్లో ఉపసంహరించుకోవాలని పేర్కొంది. దీంతో ఒక్కసారిగా సౌదీ, యూఈఏల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి.

**——మళ్లీ అలజడి**

ముకల్లా రేవుపై దాడులతోనే సౌదీ ఆగిపోలేదు. మళ్లీ శుక్రవారం భారీస్థాయిలో హద్రమౌత్‌పై విరుచుకుపడింది. వైమానిక దాడులు నిర్వహించింది. సౌదీ మద్దతుగా ఉన్న నేషనల్ షీల్డ్ ఫోర్సెస్ కూడా క్షేత్రస్థాయిలో ఎస్టీసీ దళాలతో పోరాడుతున్నాయి. ఈ దాడులను తిప్పికొడుతున్నామని ఎస్టీసీ చెబుతోంది. మొత్తానికి మళ్లీ యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమవుతున్న సూచనలు కనబడుతున్నాయి.

# ఎంసీఎక్స్ షేరు 80% తగ్గిందా?

## ––1:5 నిష్పత్తిలో విభజనే కారణం




మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్) షేరు ట్రేడింగ్‌ను గమనిస్తున్న వారికి శుక్రవారం ఒక్కసారిగా షాక్ తగిలినట్లయ్యింది. గురువారం ఈ షేరు ముగింపు ధర రూ.10,989 కాగా.. శుక్రవారం ఎన్ఎస్ఈలో ట్రేడింగ్ రూ.2230 వద్ద ప్రారంభం కావడమే ఇందుకు కారణం. ఎంసీఎక్స్ షేరును 1:5 గా విభజిస్తూ, తీసుకున్న నిర్ణయం జనవరి 2 నుంచి అమల్లోకి వచ్చింది. దీనికనుగుణంగానే షేరు ధర భారీగా తగ్గినట్లు కనిపించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఎంసీఎక్స్ షేరును, రూ.2 ముఖ విలువ కలిగిన 5 షేర్లుగా విభజించారు. అంటే ఈనెల 1న ముగింపు ధర రూ.10,989గా ఉన్న ఒక షేరు, రూ.2 ముఖవిలువ కలిగిన 5 షేర్లుగా మారాక, ట్రేడింగ్ ప్రారంభమే రూ.11,150 (5శ్రీ2230) వద్ద ప్రారంభమైనట్లు లెక్క. ఒక దశలో 4% పెరిగి 52 వారాల గరిష్ఠమైన రూ.2,278 ను తాకింది. చివరకు రూ.2,219 వద్ద ముగిసింది. అంటే రూ.11,095 వద్ద స్థిరపడినట్లు లెక్క. ముగింపు చూసుకున్నా, షేరుకు లాభమే వచ్చింది.

# ఆర్‌బీఐ భరోసా+8% వడ్డీ..

## ఈ బాండ్ల గురించి తెలుసా?




ఆర్‌బీఐ రెపో రేటును ఇటీవల తగ్గించడంతో దాదాపు అన్ని బ్యాంకులూ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గించేశాయి. ఏ కమర్షియల్ బ్యాంక్ చూసినా 66.50 శాతం మించి వడ్డీ ఇవ్వడం లేదు. దీంతో అధిక వడ్డీతో కూడిన పెట్టుబడి సాధనాల కోసం చాలామంది అన్వేషిస్తున్నారు. ముఖ్యంగా రిస్క్ వద్దనుకునేవారికి ఓ స్కీమ్ అందుబాటులో ఉంది. అదే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) ప్రవేశపెట్టిన ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్, 2020. ఈ బాండ్లపై అధిక వడ్డీతో పాటు ఆర్‌బీఐ భరోసా ఉంటుంది. దీనిపై ప్రస్తుతం ఏటా 8.05 శాతం వడ్డీ చెల్లిస్తున్నారు. ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్లలో వడ్డీ రేటు ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉండదు. ఆరు నెలలకోసారి మారుతూ ఉంటుంది. చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో ఒకటైన నేషనల్ సేవింగ్స్ స్కీమ్ (NSC)తో ఈ వడ్డీ రేట్లు ముడిపడి ఉంటాయి. NSC వడ్డీ రేటును పెంచితే ఈ బాండ్ల రేటు కూడా పెరుగుతుంది. అలాగే NSC వడ్డీ రేటు తగ్గితే ఈ బాండ్లపై వడ్డీ కూడా తగ్గుతుంది. ఎన్ఎస్‌సీ అందించే వడ్డీ రేటు కన్నా 0.35 శాతం ఎక్కువ రేటు ఈ బాండ్లపై లభిస్తుంది. 2026 జనవరి జూన్ అర్ధ వార్షికానికి 8.05 శాతంగా వడ్డీ రేటును ఆర్‌బీఐ తాజాగా ఖరారు చేసింది. నేషనల్ సేవింగ్స్ స్కీమ్ 7.7 శాతం వడ్డీ రేటు లభిస్తుండగా.. ఆర్‌బీఐ బాండ్లపై 8.05 శాతం వడ్డీ అందుతుంది. ఏడాదికి రెండు సార్లు (జనవరి 1, జులై 1) వడ్డీ మొత్తం మీ ఖాతాలో జమ అవుతుంది.

**–––ఇవి తెలుసుకోండి..**

-ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన ఈ ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్ కాల వ్యవధి ఏడేళ్లు. ఈ బాండ్లలో ముందస్తు ఉపసంహరణకు అవకాశం ఉండదు.
-సీనియర్ సిటిజన్లు మాత్రం కనీస లాక్‌ఇన్ పీరియడ్ తర్వాత పెనాల్టీతో ముందుగానే డబ్బును విత్‌డ్రా చేసుకోవచ్చు. 6070 మధ్య వయసున్న వారికి -ఆరేళ్లు, 7080 మధ్య వయసున్న వారికి ఐదేళ్లు, 80 ఏళ్లు దాటిన వారికి నాలుగేళ్ల లాక్‌ఇన్ పీరియడ్ ఉంటుంది.
-కనిష్ఠంగా వెయ్యి రూపాయలతో ఈ బాండ్లను కొనుగోలు చేయొచ్చు. గరిష్ఠ పరిమితి లేదు. వడ్డీ రేట్లలో హెచ్చుతగ్గులు ఉంటాయి కాబట్టి భవిష్యత్‌లో తగ్గితే రాబడిపై ప్రభావం ఉంటుందని గుర్తుంచుకోవాలి.
-ఈ బాండ్లపై వచ్చే వడ్డీపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ బాండ్లపై రుణ సదుపాయం లేదు. వీటిని ఇతరులకు బదిలీ చేసుకోవడమూ కుదరదు.
-ఎక్కువ వడ్డీ ఇచ్చే పథకం అయినా ఏడేళ్ల పాటు డబ్బుతో అవసరం లేదనుకున్నవారు మాత్రమే ఇందులో పెట్టుబడి పెట్టడం మంచిది.
-ఫిక్స్‌డ్ డిపాజిట్ల ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్న వారికి ఇది ఉపయోగపడుతుంది.
-తక్కువ పన్ను పరిధిలో ఉండి, రిస్క్ లేకుండా పెట్టుబడి చేయాలనుకొనేవారు ఈ మార్గాన్ని ఎంచుకోవచ్చు. ప్రత్యేకించి సీనియర్ సిటిజన్‌లకు ఇది స్థిరమైన ఆదాయ వనరుగా పని చేస్తుంది.
-ఆర్‌బీఐ ఆథరైజేషన్ పొందిన ఏదైనా బ్యాంక్ శాఖలో వీటిని కొనుగోలు చేయొచ్చు. ఇందుకోసం కేవైసీ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.
-బ్యాంక్ వెబ్‌సైట్లు, ఆర్‌బీఐకి చెందిన రిటైల్ డైరెక్ట్ పోర్టల్ నుంచి కూడా ఈ బాండ్లను కొనుగోలు చేయొచ్చు. కాంపౌండింగ్ ప్రయోజనం ఉండదు.
-భారత నివాసితులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు వీటిని కొనుగోలు చేయొచ్చు. ఎన్నారైలకు అవకాశం లేదు.
-ఉదాహరణకు మీరు ఈ బాండ్లలో రూ.లక్ష పెట్టుబడి పెడితే 8.05 శాతం వడ్డీ చొప్పున ప్రతి ఆరు నెలలకు దాదాపు రూ.4 వేలు చొప్పున మీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది.
-వడ్డీ ఆదాయంపై పన్ను వర్తిస్తుంది. బాండ్ కొనుగోలుదారుడి ఆదాయ శ్లాబు రేటుపై ఇది ఆధారపడి ఉంటుంది. వార్షికాదాయం రూ.10వేలు దాటితే -టీడీఎస్ వర్తిస్తుంది. ఫారం 15G/15H సమర్పించడం ద్వారా అర్హులైన వారు టీడీఎస్ నుంచి మినహాయింపు పొందొచ్చు.

# 'నెలకు ₹21 వేలు సంపాదన'

## గిగ్ మోడల్‌ను వెనకేసుకొచ్చిన దీపిందర్ గోయల్




జొమాటో, బ్లింకిట్ సంస్థల వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ (Deepinder Goyal) గిగ్ వర్క్ మోడల్‌ను మరోసారి వెనకేసుకొచ్చారు. వర్కర్ల వేతనం, పని పరిస్థితులపై వరుస పోస్టులు పెట్టారు. ఇటీవల గిగ్ వర్కర్ల సమ్మెలో భాగంగా 10 నిమిషాల డెలివరీ సేవలను రద్దు చేయాలన్న డిమాండ్ వినిపించింది. దీనిపై శుక్రవారం తన ఎక్స్ పోస్ట్‌లో సమర్థించుకున్నారు. తక్కువ వేతనం, సామాజిక భద్రత వంటి అంశాలూ చర్చకు రాగా.. ఆయా అంశాలపై తాజాగా వివరణ ఇస్తూ వరుస పోస్టులు పెట్టారు.

**––నెలకు రూ. 21 వేలు....** జొమాటోలో 2025లో డెలివరీ పార్ట్‌నర్ సగటు వేతనం రూ.102గా ఉందని దీపిందర్ పేర్కొన్నారు. 2024లో ఈ మొత్తం రూ.92 ఉండగా.. ఏడాదిలో 10.9 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. డెలివరీ పార్ట్‌నర్లలో చాలామంది నెలలో కొన్ని రోజులు, కొన్ని గంటలు మాత్రమే పనిచేస్తారని చెప్పారు. ఒకవేళ రోజుకు 10 గంటలు చొప్పున నెలలో 26 రోజులు పనిచేసినా ఒక్కో డెలివరీ ఏజెంట్ రూ.26,500 ఆర్జించొచ్చని, అందులోంచి పెట్రోల్, నిర్వహణ ఖర్చులు మినహాయించినా రూ.21వేలు వస్తుందని పేర్కొన్నారు. దీనికి టిప్ అదనం అని చెప్పారు.

**––ఏడాదికి 38 రోజులే....** ఫుల్ టైమ్ వర్క్‌కు ప్రత్యామ్నాయంగా గిగ్ వర్క్ మోడల్ రూపుదిద్దుకుందని దీపిందర్ పేర్కొన్నారు. అధిక పని గంటల ప్రసక్తే ఉండబోదని చెప్పారు. 2025లో డెలివరీ పార్ట్‌నర్లు సగటున 38 రోజులు, రోజుకు, ఏడేసి గంటలు మాత్రమే పనిచేశారని పేర్కొన్నారు. మొత్తం డెలివరీ పార్ట్‌నర్లలో 2.3 శాతం మంది మాత్రమే ఏడాదిలో 250 కంటే ఎక్కువ రోజులు పని చేశారని చెప్పారు. అలాంటప్పుడు పూర్తిస్థాయి ఉద్యోగితో సమానంగా ప్రయోజనాలు, స్థిరమైన వేతనాలు కోరడం ఈ మోడల్‌కు ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు. ఫలానా చోటే పనిచేయాలని గానీ, ఫలానా షిఫ్ట్‌లోనే చేయాలన్న డిమాండ్ కూడా లేదని గుర్తు చేశారు.

**––గంటకు 16 కిలోమీటర్ల వేగమే...** 10 నిమిషాల డెలివరీ హామీ వల్ల డెలివరీ ఏజెంట్లు ప్రమాదాల బారిన పడతారన్న వాదనలనూ కొట్టి పారేశారు. ఆర్డర్ చేసిన ప్రదేశం నుంచి బ్లింకిట్ 2 కిలోమీటర్లు దూరం మాత్రమే ఉంటోందని దీపిందర్ పేర్కొన్నారు. దీంతో 8 నిమిషాల్లో డెలివరీ సాధ్యమవుతోందని, ఈ లెక్కన డెలివరీ ఏజెంట్లు ప్రయాణించేది గంటకు సగటున 16 కిలోమీటర్ల వేగంతోనే అని వివరించారు.

**––రూ.100 కోట్లు ఖర్చు....** 2025లో డెలివరీ భాగస్వాముల బీమా కోసం జొమాటో, బ్లింకిట్ సంయుక్తంగా రూ.100 కోట్లు పైనే ఖర్చు చేశాయని దీపిందర్ తెలిపారు. ఒక్కో డెలివరీ పార్ట్‌నర్‌కు రూ.10 లక్షల ప్రమాద బీమా కవరేజీ కల్పిస్తున్నట్లు చెప్పారు.

**––అదనంగా ఇవీ..** మహిళా డెలివరీ ఏజెంట్లకు నెలకు వేతనంతో కూడిన రెండు విశ్రాంత సెలవులు ఇస్తున్నామని దీపిందర్ తెలిపారు. ట్యాక్స్ ఫైలింగ్‌లో సహకారం, ఎన్‌పీఎస్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. 95 వేల మంది ట్యాక్స్ ఫైలింగ్ సదుపాయాన్ని వినియోగించగా.. 54 వేల మంది పెన్షన్ స్కీమ్‌కు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇన్ని కల్పిస్తున్నా గిగ్ వర్కర్ల పని పరిస్థితుల గురించి ఆందోళన వ్యక్తంచేయడం సమంజసమా? అని దీపిందర్ ప్రశ్నించారు.


## ఐటీసీ షేరు పతనం..

## ఎల్‌ఐసీకి రూ.11,468 కోట్ల నష్టం

### –మరో 2 బీమా సంస్థలకూ

సిగరెట్లపై కొత్త ఎక్సైజ్ సుంకం విధింపు ప్రభావంతో ఐటీసీ షేరుకు రెండో రోజూ నష్టాలు కొనసాగాయి. గురువారం 9.69% నష్టపోయిన ఈ షేరు.. శుక్రవారం మరో 3.79% డీలాపడి రూ.350.15 వద్ద ముగిసింది. కొత్త ఏడాది తొలి రెండు రోజుల్లో కలిపి ఐటీసీ షేరు 14% వరకు పడటంతో, ఇందులో భారీ వాటాలున్న లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎల్ఐసీ), ఇతర ప్రభుత్వ రంగ బీమా సంస్థలూ ఆ మేరకు నష్టపోయాయి. ఎల్ఐసీకి 15.86%, జనరల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు (జీఐసీ) 1.73%, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీకి 1.4% మేర ఐటీసీలో వాటాలున్నాయి. రెండు రోజుల్లో ఐటీసీ షేరు 14% నష్టపోవడంతో ఎల్ఐసీ తన వాటా విలువలో రూ.11,468 కోట్లను కోల్పోయింది. ఐటీసీలో జీఐసీ వాటా విలువ రూ.1,254 కోట్లు, న్యూ ఇండియా అస్యూరెన్స్ వాటా విలువ రూ.1,018 కోట్ల మేర తగ్గింది. ఈ 3 బీమా సంస్థలకు కలిపి రూ.13,740 కోట్ల నష్టం వాటిల్లింది. నీ ఐటీసీ మార్కెట్ విలువ రూ.72,000 కోట్లు హరించుకుపోయింది.

## అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1000 కోట్ల ఎన్‌సీడీ ఇష్యూ




అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడో విడత ఎన్‌సీడీ (మార్పిడి రహిత డిబెంచర్ల) పబ్లిక్ ఇష్యూ జనవరి 6న ప్రారంభమై 19న ముగియనుంది. ప్రాథమిక ఇష్యూ పరిమాణం రూ.500 కోట్లు కాగా.. స్పందన ఆధారంగా దీనిని మరో రూ. 500 కోట్లకు పెంచుకోనుంది. వార్షికంగా ఈ ఎన్‌సీడీలపై 8.9% ప్రతిఫలాన్ని సంస్థ ఆఫర్ చేస్తోంది. ఇష్యూ అనంతరం బీఎస్ఈ, ఎన్ ఎస్ఈల్లో ఎన్‌సీడీలను నమోదు చేయాలని అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రతిపాదించింది. దరఖా స్తు చేసుకున్న క్రమం (ఫస్ట్ కమ్, ఫస్ట్ సర్వ్‌డ్) ఆధారంగా ఎన్‌సీడీల కేటాయింపునకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది.

# ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీకి

## రూ.41,863 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం



ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పథకం (ఈసీఎంఎస్) కింద రూ.41,863 కోట్ల పెట్టుబడితో తలపెట్టిన 22 నూతన ప్రతిపాదనలను ఆమోదించినట్లు ఎలక్ట్రానిక్స్‌ఐటీ శాఖ శుక్రవారం తెలిపింది. ఇందువల్ల రూ.2,58,152 కోట్ల విలువైన ఉత్పత్తులు తయారవుతాయని, 33,791 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వెల్లడించింది. గతంలో రూ.12,704 కోట్ల పెట్టుబడి అంచనాలతో 24 ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇవి అమల్లోకి వస్తే, కీలకమైన ఎలక్ట్రానిక్స్ విడిభాగాల కోసం విదేశాలపై ఆధారపడటమూ తగ్గుతుంది. ఐఫోన్ల సంస్థ యాపిల్ తన తయారీని చైనా వెలుపల విస్తరించాలని చూస్తున్న నేపథ్యంలో, ఆ సంస్థకు విడిభాగాలు సరఫరా చేసే కొత్త వెండర్లూ ఇప్పుడు దరఖాస్తు చేసినట్లు చెబుతున్నారు. ఈ కంపెనీలు.... టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, డిక్సన్, హిందాల్కో ఇండస్ట్రీస్, మదర్‌సన్ ఎలక్ట్రానిక్ కాంపొనెంట్స్, శామ్‌సంగ్ డిస్‌ప్లే నోయిడా, వంటివి ఈ పథకం కింద తాజాగా దరఖాస్తు చేసుకున్నాయి. వీటి తయారీకి ....పీసీబీలు, కెపాసిటర్లు, కనెక్టర్లు, ఎంక్లోజర్లు, లిథియం అయాన్ సెల్స్, కెమేరా మాడ్యూల్స్, డిస్‌ప్లే మాడ్యూల్స్, ఆప్టికల్ ట్రాన్‌సీవర్స్, మొబైల్ తయారీ, టెలికాం, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, వ్యూహాత్మక ఎలక్ట్రానిక్స్, వాహన, ఐటీ హార్డ్‌వేర్ తయారీకి తాజా ప్రతిపాదనలు వచ్చాయి. మొబైల్ తయారీలో వినియోగించే విడిభాగాల తయారీకి రూ.27,166 కోట్లు; పీసీబీ విభాగంలో రూ.7377 కోట్లు, లిథియం అయాన్ సెల్ విభాగంలో రూ.2922 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ సహా 8 రాష్ట్రాల్లో: ఆంధ్రప్రదేశ్, హరియాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో కొత్త యూనిట్లు ఏర్పాటు కానున్నాయి.


# ఎయిర్, వాటర్ ప్యూరిఫయర్‌లపై 'జీఎస్‌టీ' కోత!

## *–15 రోజుల్లో మండలి సమావేశంలో నిర్ణయం*

దేశంలో కాలుష్య ఇబ్బందులు పెరుగుతున్న నేపథ్యంలో.. కోర్టు సూచనల మేరకు వాటర్, ఎయిర్ ప్యూరిఫయర్‌లపై వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)ని 18% నుంచి 5 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రతిపాదనను పరిశీలించడానికి కేంద్ర, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్న జీఎస్‌టీ మండలి వచ్చే 15 రోజుల్లోగా సమావేశమయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దిల్లీతో పాటు పలు నగరాల్లో వాయు కాలుష్యం కారణంగా ప్రజారోగ్యానికి చేటు వాటిల్లుతోందనే ఆందోళనలు, కోర్టుల జోక్యం, పరిశ్రమ, రాజకీయ నాయకుల డిమాండ్ నేపథ్యంలో పన్నుల తగ్గింపును ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనుంది. ఇప్పటివరకు త్రైమాసికానికి ఒకసారి జీఎస్‌టీ మండలి సమావేశమవుతోంది. ఇంతకు ముందు చివరిసారిగా సెప్టెంబరులో మండలి సమావేశం జరిగింది. ప్యూరిఫయర్‌లపై పన్ను తగ్గింపునకు రాష్ట్రాల ఆర్థిక మంత్రుల మధ్య ఏకాభిప్రాయం అవసరమవుతుంది. ఈ ఉత్పత్తులను అత్యవసర వస్తువులుగా వర్గీకరించి, జీఎస్‌టీని 18% నుంచి 5 శాతానికి తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. గృహ అవసరాల కోసం వినియోగించే కొన్ని పురుగు మందులు, ఎలుకలను చంపడానికి వాడే ఉత్పత్తులపై జీఎస్‌టీని తగ్గించడంపైనా మండలి చర్చించనుంది. వీటిపై ప్రస్తుతం 18% జీఎస్‌టీ ఉంది. ఈ ఉత్పత్తులను కూడా 5% శ్లాబ్‌కు మార్చొచ్చని అంటున్నారు. ఇదీ నేపథ్యం.... దేశంలోని ప్రధాన నగరాల్లో గాలి నాణ్యత క్షీణించడం, సురక్షిత తాగునీరు లభించడం లేదన్న ఆందోళనలతో ఎయిర్, వాటర్ ప్యూరిఫయర్‌లపై జీఎస్‌టీ తగ్గించాలన్న డిమాండ్‌లు పెరిగాయి. పన్ను రేట్ల తగ్గింపు ప్రతిపాదన పరిశీలనకు సాధ్యమైనంత త్వరగా జీఎస్‌టీ మండలి సమావేశాన్ని నిర్వహించాలని కేంద్రాన్ని గత నెల 24న దిల్లీ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో రాజకీయ డిమాండ్‌లు కూడా పెరిగాయి. వాటర్ ప్యూరిఫయర్‌లపై జీఎస్‌టీ తగ్గించాలని దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలి పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తింది. వీటిపై పన్నులను 5 శాతానికి తగ్గించాలని పరిశ్రమ, వాణిజ్య సంస్థలు ప్రభుత్వానికి విడివిడిగా విజ్ఞప్తులు సమర్పించాయి.




## వారణాసి' కోసం యుద్ధవిద్య నేర్చుకున్న మహేశ్.... ట్రైనర్ ఏం చెప్పారంటే!




**వారణాసి'తో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించేందుకు రాజమౌళి, మహేశ్ బాబు సిద్ధమవుతున్నారు. దీని కోసం మహేశ్ బాబు ప్రాచీన భారత యుద్ధ కళ కలరిపయట్టు నేర్చుకున్నారు. ఆయనకు శిక్షణ ఇచ్చిన ట్రైనర్ పెట్టిన పోస్ట్‌తో ఈ విషయం బయటకు వచ్చింది.**

రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో మహేశ్‌బాబు 'రుద్ర' పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ పవర్‌ఫుల్ పాత్ర కోసం ఆయన కలరిపయట్టు నేర్చుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ మహేశ్‌కు ఈ ట్రైనింగ్ ఇచ్చారు. తాజాగా హరికృష్ణ ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "నేను గత సంవత్సరం మహేశ్ సర్‌కు శిక్షణ ఇచ్చాను. కానీ సమయం వచ్చేవరకూ ఆ విషయాన్ని బయటపెట్టొద్దని చిత్రబృందం కోరింది. అందుకే ఇప్పటివరకూ వెల్లడించలేదు. ఇంత పెద్ద ప్రాజెక్ట్‌కు వర్క్ చేస్తానని అనుకోలేదు. మహేశ్‌కు ట్రైనింగ్ ఇవ్వడం చాలా ఆనందాన్నిచ్చింది" "ఈ ఏడాది జనవరిలో వారణాసి షూటింగ్‌కు వెళ్లే ముందే మహేశ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నారు. కలరిపయట్టు కూడా అందులో భాగమే. నేను ఆయన కంటే చాలా చిన్నవాడిని కానీ, ఆయన నన్ను గౌరవించిన విధానం చూసి ఆశ్చర్యపోయాను. నేను చెప్పిన ప్రతి పనీ చేసేవారు. మొదట రెండు నెలలు అనుకున్న ట్రైనింగ్ తర్వాత మరికొన్ని నెలలు పొడిగించాం" అని హరి వెల్లడించారు. గతంలో ఈ యుద్ధ విద్యను 'కాంతార' కోసం రిషబ్, 'ఇండియన్ -2' కోసం కాజల్ నేర్చుకున్నారు. "కలరిపయట్టు' అనేది ఓ పురాతన కేరళ యుద్ధ కళ. దీనినుంచే కుంగ్ ఫు, కరాటే, తైక్వాండో వంటి ఎన్నో మార్షల్ ఆర్ట్స్ పుట్టుకొచ్చాయి. గెరిల్లా యుద్ధానికి దీన్ని ఎక్కువగా ఉపయోగించేవారు. దీన్ని సాధన చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా శక్తిని పొందొచ్చు" అని గతంలో కాజల్ దీనిపై పోస్ట్ పెట్టారు. 'వారణాసి' యాక్షన్ అడ్వెంచర్‌గా రానుంది. మహేశ్ కొన్ని సన్నివేశాల్లో రాముడిగానూ కనిపించనున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా, కుంభ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలన్నది రాజమౌళి ప్లాన్.

## టెన్నిస్ బంతుల పాప....
# టాప్ లేపేస్తుంది



కె ర్యాంప్ బ్యూటీ.. అందాలతో ర్యాంప్ ఆడిస్తుందిగా

అందాల భామ యుక్తి తరేజా గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రంగబలి సినిమాతో యుక్తి తెలుగు తెరకు పరిచయం అయ్యింది. అందం, అభినయం కలిపి చూపించడంతో మొదటి సినిమాతోనే అమ్మడు తెలుగు కుర్రకారు గుండెల్లో ఒక క్రష్ గా నిలిచిపోయింది. ఇక ఈ ఏడాది బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న కె ర్యాంప్ సినిమాలో యుక్తినే హీరోయిన్. కిరణ్ అబ్బవరం నటించిన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. కె ర్యాంప్ లో యుక్తి నటనకు విమర్శకులు సైతం ప్రశంసలు అందించారు. ఈ సినిమాతో ఓవర్ నైట్ స్టార్ గా మారిపోయింది. సినిమాల్లోనే కాదు సోషల్ మీడియాలో కూడా అందాలను ఆరబోసే ఈ భామ తాజాగా టెన్నిస్ ఆడుతూ థైస్ అందాలను ఎరగా వేసిన ఫోటోలను అభిమానులతో షేర్ చేసుకుంది. ఈ ఫోటోలు చూసిన అభిమానులు టెన్నిస్ బంతుల పాప.. టాప్ లేపేస్తుందిగా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ప్రస్తుతం యుక్తి ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.

## ప్రదీప్ రంగనాథన్ సరసన మీనాక్షి?



లవ్ టుడే'తో నటుడిగా, దర్శకుడిగా తన ప్రతిభను నిరూపించుకున్నారు తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్. యువతను ఆకట్టుకునే కథలతో మెప్పించే ఈయన.. ఇప్పుడు మరోసారి కెప్టెన్ కుర్చీలో కూర్చోబోతున్నట్లు తెలుస్తోంది. ఆయన సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో ఓ చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ప్రదీప్ సరసన మీనాక్షి చౌదరి కనిపించనుందట. "ప్రస్తుతం దక్షిణాదిలో వరుస సినిమాలతో బిజీగా ఉన్న మీనాక్షికి.. ఇప్పుడు రాబోయే ప్రాజెక్టు ఆమె కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలవనుంది. ప్రదీప్ స్వీయ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రదీప్ మునుపటి చిత్రాల మాదిరిగా కాకుండా.. భిన్నంగా ఉండనుందీ సినిమా. మార్చిలో సెట్స్‌పైకి తీసుకెళ్లి.. ఒకే షెడ్యూల్‌లో చిత్రీకరణను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నార"ని ప్రదీప్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ప్రదీప్, మీనాక్షిల జోడీ తెరపై చేసే మ్యాజిక్ ఎలా ఉంటుందో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## చంద్రబోస్‌కు రూ.10లక్షలు సంపాదించి పెట్టిన పాట ఇది

ప్రపంచ యవనికపై తెలుగు పాటకు పట్టం కట్టేలా చేసిన గేయ రచయిత చంద్రబోస్. 'ఆర్ఆర్ఆర్'లో 'నాటు నాటు'కు ఉత్తమ గేయ రచయితగా, సంగీత దర్శకుడు కీరవాణితో కలిసి ఆస్కార్‌ను అందుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన అనేక విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా గేయ రచయితల హక్కులు కాపాడటంతో పాటు, రాయల్టీ రూపంలో డబ్బులు ఎలా వస్తాయో వివరించారు. "సినిమా ఇండస్ట్రీలో కష్టానికి తగిన ఫలితం ఉంటుంది. గేయ రచయితలకు పారితోషికం బాగానే ఉంటుంది. బాగా రాసి, బహుళ ప్రజాదరణ పొందితే ఐపీఆర్ఎస్ (ఇండియన్ ఫెర్మారింగ్ రైట్స్ సొసైటీ) ద్వారా రాయల్టీ కూడా వస్తూ ఉంటుంది. పాట విజయాన్ని, ఘనతను, చరిత్రను బట్టి ఆ మొత్తం ఉంటుంది. ఎక్కువ వేదికల్లో మార్మోగితే ఇంకా ఎక్కువ డబ్బులు వస్తాయి. ఉదాహరణకు ఒక పాటకు రాయల్టీ రూపంలో రూపాయి వస్తే, అందులో రచయిత, సంగీత దర్శకుడికి చెరో పావలా, పబ్లిషింగ్ కంపెనీకి 50పైసలు ఇస్తారు. అత్యంత ప్రజాదరణ పొందిన పాటల్లో 'చిరు చిరు చినుకై కురిశావే' ఒకటి. ఆ పాట రాసినప్పుడు నాకు రూ.25వేలు ఇచ్చారు. ఇప్పటికి ఆ పాట రాయల్టీ రూపంలో రూ.10లక్షలు సంపాదించింది. ఇంకా వస్తూనే ఉంటుంది. రూ.50వేల నుంచి రూ.లక్ష వచ్చిన సందర్భమూ ఉంది. బ్రహ్మాస్త్ర'లో 'కుంకుమలా నువ్వే' పాట కూడా అంతే" "మనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకుంటే, ప్రతిదీ ఒక మెట్టు అవుతుంది. అనువాద గీతాలు చక్కగా రాయడం వల్ల కూడా రాయల్టీ వస్తోంది. గత పదిపదిహేనేళ్లుగా రచయితల పరిస్థితి బాగానే ఉంది. సాధారణంగా సినిమా కోసం పాట రాస్తాం. కానీ, ఆ పాట సినిమా నుంచి బయటకు వచ్చి, దానిని మించి ఎదుగుతోంది. ఒక పాటను థియేటర్, టీవీ, సెల్‌ఫోన్, రేడియో, హోటల్ లాంజ్‌లు, రియాల్టీషో ఇలా చాలా చోట్ల వింటాం. ఇంతకు ముందు రచయితలు కష్టపడేవారు. మా హక్కులను కాపాడిన వ్యక్తి సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు. ఐపీఆర్ఎస్ చట్టం ఆనుపానులు ఆయన పరిశీలించారు, పరిశోధించారు. ఆరోగ్యం సహకరించకపోయినా నిర్మాతలు, పబ్లిషర్ల తరపున పోరాటం చేశారు. లాయర్లతో కూర్చొని చర్చించి, ఏది చేస్తే రచయితలకు మేలు జరుగుతుందో అనే విషయాల కష్టపడి పరిశీలించి, ఫలాలను మాకిచ్చి వెళ్లిపోయారు. కరోనా సమయంలో ఎవరికీ పనులు లేవు. కానీ, రాయల్టీ వచ్చింది. ప్రతి రచయితకు మూడు నెలలకు ఒకసారి రూ. 50వేలు పంపారు. ఎంతో మంది యువ రచయితలకు ఇది ఉపయోగపడింది. ఆ సంస్థను కాపాడాలంటే మంచి పాటలు రాయాలి"అని అన్నారు.





## దుమ్ము లేపుతుంది క్వీన్ ఆఫ్ మార్క్ దీప్శిఖా చంద్రన్

కన్నడ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మార్క్' శాండల్‌వుడ్ లో అదరగొడుతోంది. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. సుదీప్, దీప్శిఖా చంద్రన్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి విజయ్ కార్తికేయన్ దర్శకుడు. ఈ సినిమాకు సుదీప్ నటన ఈ చిత్రానికి ఎంత హైలైట్గా నిలిచింది. హీరోయిన్ దీప్శిఖ చంద్రన్ నటన కూడా అంతే ప్లస్ అయిందని విమర్శకులు చెబుతున్నారు. తెరపై ఆమె కనిపించిన ప్రతిసారి ఈలలు, చప్పట్లను అందుకుంటోంది. దీప్శిఖా స్క్రీన్ ప్రజెన్స్ ప్రేక్షకులని అలరించింది. ఆమె యాక్షన్ బ్లాక్ ప్రశంసలు అందుకుంది. ప్రేక్షకులు ఆమెను 'మార్క్ క్వీన్','క్వీన్ ఆఫ్ మార్క్' అని ప్రశంసలు కురిపిస్తున్నారు. దీప్శిఖ చంద్రన్ కెరీర్‌లో ఈ సినిమా ఒక మైల్ స్టోన్ గా నిలిచిందని చెబుతోంది.

## పెద్ది రిలీజ్ వాయిదా..



కొత్త సంవత్సరం.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులకు ట్రీట్ ఇస్తాడనుకుంటే.. షాక్ ఇచ్చాడని నెటిజన్స్ మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం చరణ్ నటిస్తున్న చిత్రం పెద్ది . బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మెగా ఫ్యాన్స్ అందరూ పెద్దిపైనే ఆశలు పెట్టుకున్నారు. మార్చి 27 అనగా రామ్ చరణ్ పుట్టినరోజు కానుకగా పెద్ది సినిమాను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అందుకు తగ్గట్లే షూటింగ్ ని ఫినిష్ చేస్తూ.. ఇంకోపక్క ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టారు. ఇక అందరూ అనుకున్నట్లుగానే న్యూయర్ కి పెద్ది నుంచి ఒక సర్ ప్రైజ్ పోస్టర్ కానీ, గ్లింప్స్ కానీ వస్తుంది అనుకుంటే.. మేకర్స్ మాత్రం ఈసారి చాలా సైలెంట్ గా ఉన్నారు. ఈ మౌనం వెనుక కారణం సినిమా వాయిదా పడడమే అని సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. షూటింగ్ ఇంకా ఫినిష్ కాకపోవడం, కొన్ని సాంకేతిక కారణాల వలన మేకర్స్ పెద్దిని మార్చి 27 న రిలీజ్ చేయలేరని తెలుస్తోంది. ఇక ఈ సినిమాను డిసెంబర్ లో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారట. ఇక ఈ విషయం తెలియడంతో మెగా ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది. ఇక పెద్ది కనుక ఆ టైమ్ రాకపోతే.. ది ప్యారడైజ్, టాక్సిక్ సినిమాలకు మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉంది. మరి ఈ వార్తలపై మేకర్స్ ఎలా స్పందిస్తారో చూడాలి.

## పిల్లలకు మంచి అలవాట్లు మనమే నేర్పాలి: నటి రోహిణి

పిల్లలు తప్పుదారి పట్టకుండా మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, కుటుంబంపైనే ఉందని నటి రోహిణి అన్నారు. మాదక ద్రవ్యాలు సహా చెడు అలవాట్లకు వారు బానిసలు కాకుండా చూడాలన్నారు. మనం పాటించే మంచి అలవాట్లను వారికి ముందుగా చెప్పాలన్నారు. తాజాగా ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్నప్పుడు 'యశోద కృష్ణ'లో నటించానని తనని కన్నది తెలుగు తల్లి అయితే, పెంచింది తమిళ తల్లి అని అన్నారు.

**----పిల్లలను కూర్చోబెట్టి చెప్పండి**

"ప్రస్తుతం సమాజంలో యువత మాదక ద్రవ్యాల బారిన పడుతోంది. వాటి నియంత్రణకు పోలీసులు, వివిధ శాఖల అధికారులు పనిచేస్తున్నారు, మనం కూడా మన వంతు బాధ్యత నిర్వర్తించాలి. మన పిల్లల్ని మంచి దారిలో నడిపించాలి. స్నేహితుల మెప్పు కోసం ఇలాంటివి అలవాటు చేసుకోకూడదని చెప్పాలి. మన బిడ్డలో తేడా కనిపిస్తే, గమనించి కూర్చోబెట్టి అన్నీ చెప్పాలి. 'బట్టలు వేసుకుని, బయటకు వెళ్లాలి.. నగ్నంగా వెళ్లకూడద'ని చెబుతున్నాం. దాన్ని అలవాటు చేస్తున్నాం. ఇక్కడ అందరం చీరలు కట్టుకుంటున్నాం. లండన్‌లో షార్ట్స్, స్కర్ట్స్ వేసుకుంటున్నారు. అది వాళ్లకు అలవాటు. మన అలవాట్లు కూడా మనమే మన పిల్లలకు చెప్పాలి. మా అబ్బాయికి ఇదే విషయం చెబుతుంటాను. చెడు అలవాట్ల వల్ల జరిగే కష్టనష్టాలు పిల్లలకు తెలియజేయాలి. క్లిష్టమైన సమయంలో మనం ఇచ్చే సలహాలు వాళ్లకు ఉపయోగపడతాయి. వాళ్లు విన్నా, వినకపోయినా, మనం చెప్పాల్సింది చెప్పి తీరాలి. రాబోయే తరాలు బాగుంటేనే భవిష్యత్ బాగుంటుంది"

**--అమ్మాయిలకే ఎందుకు..?**

"ఈ సమాజం నాకు స్త్రీ అనే పాత్ర ఇచ్చింది. ఆమె ఎలా ఉండాలనే దానిపై మనకు కొన్ని విషయాలు నేర్పిస్తారు. 'ఇలాగే కూర్చోవాలి. ఈ వంటలు నేర్చుకోవాలి' అంటారు. ఎందుకంటే 'నువ్వు ఇంకొకరి ఇంటికి వెళ్తున్నావు కదా. అక్కడ మా పేరు నిలబెట్టాలి' అని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రతి కుటుంబంలోని అమ్మాయిలకు అమ్మే ఇలాంటి విషయాలు చెబుతుంది. అలాగే, కొడుకుకి కూడా 'ఈ పని చేయొద్దు. ఆడదే పని చేయాలి' అని అమ్మే చెప్పి పెంచుతోంది. అలా కాకుండా 'మీరు ఇద్దరూ కలిసి పనిచేయాలి రా' అని అమ్మ చెప్పి పెంచితే బాగుంటుంది"

**--జీతాలు లేని శ్రామికులు మహిళలు**

"ప్రతి మహిళ చదువుకోవాలి. ఈ సమాజంలో చాలా విషయాలను సరిచేసే శక్తి స్త్రీకి ఉంది. రాబోయే తరాల ఆలోచనలను మార్చగలదు. అహోరాత్రులు ఇంట్లో శ్రమించే మహిళల గురించి మనం పట్టించుకోవాలి. జీతాలు లేని శ్రామికులు మహిళలు. పుట్టుకతోనే శ్రామికులం. అన్నం ఎవరు వండినా ఉడుకుతుంది కదా! అబ్బాయిలకు కూడా అన్నీ నేర్పండి. బయట అభ్యుదయ భావాలు మాట్లాడుతున్న వాళ్లు కూడా కొంచెం ఇంట్లో వాళ్ల గురించి కూడా ఆలోచించండి. సమాజంలో మాదక ద్రవ్యాలు వినియోగం పెరిగింది. యువతను పక్క దారి పట్టించే పనిలో భాగంగా ఇలా చేస్తున్నారు. అందరూ చదువుకుంటే పల్లకీ మోసేదెవరు? అన్నట్లు కొందరి వ్యవహారశైలి ఉంది. అందరూ పల్లకి ఎక్కాల్సిన అవసరం లేదు. కలిసి సమానంగా నడిచే సమాజం రావాలి" అని రోహిణి అన్నారు.



## సెలక్షన్ రోజే విఫలమైన ఇషాన్ కిషన్!..
# అయినా ఢోకా లేదు!



స్వదేశంలో సౌతాఫ్రికాతో ఆల్ ఫార్మాట్ సిరీస్‌లు ముగించుకున్న టీమిండియా.. తదుపరి సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో వన్డే, టీ20లు ఆడనుంది. జనవరి 11 జనవరి 31 మధ్య భారత్ కివీస్ జట్ల మధ్య మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు జరుగుతాయి. అయితే, ప్రపంచకప్2026కు ఎంపిక చేసిన జట్టునే కివీస్‌తో టీ20 సిరీస్‌కూ ఫైనల్ చేసింది బీసీసీఐ.

**వన్డేల్లోనూ పునరాగమనం!**

అయితే, వన్డేలకు మాత్రం శనివారం జట్టును ప్రకటించేందుకు బీసీసీఐ ముహూర్తం ఖరారు చేసింది. అనూహ్య రీతిలో టీ20 ప్రపంచకప్‌తో టీమిండియాలో రీఎంట్రీ ఇచ్చిన జార్ఖండ్ డైనమైట్.. వన్డేల్లోనూ పునరాగమనం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వికెట్ కీపర్ కోటాలోని రిషభ్ పంత్ వరుస వైఫల్యాల(VHT) నేపథ్యంలో.. కేఎల్ రాహుల్‌కు బ్యాకప్‌గా ఇషాన్ రేసులోకి వచ్చాడు.

ఈ నేపథ్యంలో దేశీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ 202526లో.. శనివారం నాటి మ్యాచ్‌లో జార్ఖండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ ప్రదర్శన ఎలా ఉంటుందన్న ఆసక్తి నెలకొంది. కర్ణాటకతో మ్యాచ్‌లో 33 బంతుల్లోనే శతక్కొట్టిన ఈ ఎడమచేతి వాటం బ్యాటర్.. తాజాగా కేరళతో మ్యాచ్‌లో మాత్రం స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయాడు.

**సెలక్షన్ రోజు విఫలం**

కివీస్‌తో వన్డేలకు భారత జట్టు సెలక్షన్ రోజు ఇషాన్ ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి 21 బంతుల్లో 21 పరుగులు మాత్రమే చేసి నిష్క్రమించాడు. జార్ఖండ్ తరఫున కెప్టెన్ ఇషాన్ విఫలం కాగా.. కుమార్ కుశాగ్రా అజేయ, భారీ శతకం (143)తో అదరగొట్టగా.. అనుకూల్ రాయ్ (72) కూడా ఆకట్టుకున్నాడు.

వీరిద్దరి అద్భుత ప్రదర్శన కారణంగా జార్ఖండ్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 311 పరుగులు చేయగలిగింది. కాగా ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఫెయిలైనా కివీస్‌తో వన్డేలకు అతడు ఎంపికయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కాగా దేశవాళీ టీ20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ2025లో ఇషాన్ కిషన్ ఇరగదీసిన విషయం తెలిసిందే.

**ఏకంగా ప్రపంచకప్ జట్టులోకి**

జార్ఖండ్ సారథిగా.. బ్యాటర్‌గా సంచలన ప్రదర్శనతో ఆకట్టుకున్న ఇషాన్ కిషన్.. జట్టుకు తొలి దేశీ టీ20 టైటిల్ అందించాడు. 500కు పైగా పరుగులతో టాప్ రన్ స్కోరర్‌గానూ నిలిచాడు. ఈ నేపథ్యంలో టీ20 ప్రపంచకప్2026 టోర్నీకి రిషభ్ పంత్‌ను కాకుండా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు సెలక్టర్లు. సంజూ శాంసన్‌కు బ్యాకప్ కీపర్, ఓపెనర్‌గా అతడు ఉపయోగపడతాడన్న ఆలోచనతో రీఎంట్రీ ఇచ్చే అవకాశం కల్పించారు.

కాగా క్రమశిక్షణా రాహిత్యం కారణంగా రెండేళ్లకు పైగా ఇషాన్ టీమిండియాకు దూరమైన విషయం తెలిసిందే. అయితే, తన అద్భుత ఆట తీరు, నైపుణ్యాలతో తిరిగి జట్టులో స్థానం సంపాదించాడు.

# బంగ్లాదేశ్ టూర్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం!



భారత్, బంగ్లాదేశ్ (IND vs BAN) మధ్య రోజురోజుకూ రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. దీంతో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది టీమ్‌ఇండియా బంగ్లాదేశ్ పర్యటనను తాత్కాలికంగా నిలిపివేయాలని బోర్డు నిర్ణయించినట్లు సమాచారం. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (BCB) ఈ ఏడాది తాము ఆడబోయే సిరీస్‌ల వివరాలను శుక్రవారం ప్రకటించింది. సెప్టెంబరులో భారత జట్టుతో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనున్నట్లు అందులో పేర్కొంది. అయితే, బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరత, హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో టీమ్‌ఇండియా పర్యటనను బీసీసీఐ తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలుస్తోంది.

'బంగ్లాదేశ్ టూర్‌ను మేం ఇంకా ఖరారు చేయలేదు. గతేడాది కూడా మా జట్టు బంగ్లా పర్యటనకు వెళ్లలేదు. స్వదేశంలో జరిగే అంతర్జాతీయ సిరీస్ క్యాలెండర్‌ను బీసీబీ విడుదల చేసినప్పటికీ.. టీమ్‌ఇండియా పర్యటించేది మాత్రం అనుమానమే. ఎందుకంటే టీమ్‌ఇండియా ఇతర దేశాలకు వెళ్లి ఆడాలంటే భారత ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరి. ఇక, టీ20 ప్రపంచ కప్ విషయానికొస్తే.. షెడ్యూల్ ప్రకారమే.. బంగ్లాదేశ్ మ్యాచ్‌లు భారత్‌లో జరగనున్నాయి' అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

# వైభవ్ విఫలమైనా.. టీమిండియా భారీ స్కోర్



బెనోని వేదికగా దక్షిణాఫ్రికా అండర్19తో జరుగుతున్న మొదటి యూత్ వన్డేలో భారత్ అండర్19 జట్టు బ్యాటర్లు అదరగొట్టారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత యువ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ(11), వైస్ కెప్టెన్ ఆరోన్ జార్జ్(11), త్రివేది(21) వంటి టాపార్డర్ బ్యాటర్లు విఫలమైనప్పటికి.. మిడిలార్డర్, లోయార్డర్ బ్యాటర్లు మాత్రం అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా 19 ఏళ్ల హర్వంశ్ సింగ్ పంగాలియా అసాధరణ పోరాటం కనబరిచాడు. క్లిష్ట సమయంలో హర్వంశ్.. అంబరీష్‌తో కలిసిఐదో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. పంగాలియా 95 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 93 పరుగులు చేశాడు. అతడితో పాటు అంబరిష్(65), కన్షిక్ చౌహాన్(32), ఖిలాన్ పటేల్(26) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.

సౌతాఫ్రికా బౌలర్లలో బాసన్ నాలుగు వికెట్లతో సత్తాచాటగా.. సోనీ,బాసన్, మబాతా తలా వికెట్ సాధించారు. కాగా ఈ సిరీస్ అండర్19 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా జరుగుతోంది. ఈ సిరీస్‌కు రెగ్యూలర్ కెప్టెన్ అయూష్ మాత్రే దూరమయ్యాడు. ఈ క్రమంలోనే వైభవ్‌కు జట్టు పగ్గాలను అప్పగించారు. కానీ కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లో సూర్యవంశీ విఫలమయ్యాడు.

తుది జట్లు

భారత్ అండర్19: వైభవ్ సూర్యవంశీ (కెప్టెన్), ఆరోన్ వర్గీస్, వేదాంత్ త్రివేది, అభిజ్ఞాన్ కుందు (కీపర్), హర్వంశ్ పంగాలియా, ఆర్.ఎస్. అంబరీష్, కనిష్క్ చౌహాన్, మహమ్మద్ ఎనాన్, ఖిలన్ పటేల్, దీపేష్ దేవేంద్రన్, హెనిల్ పటేల్.

దక్షిణాఫ్రికా అండర్ 19:మొహమ్మద్ బుల్బులియా (కెప్టెన్), జోరిచ్ వాన్ షాల్క్‌వైక్, అద్నాన్ లగాడియన్, జేసన్ రౌల్స్, అర్మాన్ మనక్, పాల్ జేమ్స్, బండిల్ మబాతా, లెతాబో పహ్లామోహ్లాకా (కీపర్), జెజె బాసన్, బయండా మజోలా, నితాండో సోని.

# 'షమీకి అన్యాయం.. ఇది నిజంగా సిగ్గు చేటు'

**టీమిండియా స్టార్ మహ్మద్ షమీకి జాతీయ సెలెక్టర్లు మరోసారి మొండిచేయి చూపించారు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ జట్టులో షమీకి చోటు దక్కలేదు. కివీస్‌తో వన్డే సిరీస్‌కు షమీని ఎంపిక చేయనున్నారని జోరుగా ప్రచారం జరిగింది.**



కానీ అజిత్ అగార్కర్ అండ్ కో మాత్రం షమీని పరిగణలోకి తీసుకోలేదు. జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడంతో మహ్మద్ సిరాజ్‌కు తిరిగి పిలుపునిచ్చారు. అదేవిధంగా పేస్ బౌలింగ్ విభాగంలో ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్‌లకు చోటు దక్కింది.

అయితే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న షమీని జట్టులోకి తీసుకోకపోవడంపై చాలా మంది మాజీలు తప్పుబడుతున్నారు. భారత జట్టుకు తిరిగి ఆడాలంటే అతడు ఇంకా ఏమి చేయాలని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బెంగాల్ జట్టు హెడ్ కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా సెలెక్టర్లపై తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు.

దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నప్పటికి, షమీని జాతీయ జట్టులోకి ఎందుకు తీసుకోవడం లేదని అతడు ఫైరయ్యాడు. షమీ చివరగా భారత్ తరపున గతేడాది మార్చిలో ఆడాడు. అప్పటి నుంచి జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. కానీ దేశవాళీ క్రికెట్‌లో మాత్రం క్రమం తప్పకుండా ఆడుతున్నాడు.

**షమీకి అన్యాయం..**

సెలక్షన్ కమిటీ మరోసారి మహమ్మద్ షమీకి అన్యాయం చేసింది. ఇటీవలి కాలంలో ఏ అంతర్జాతీయ ఆటగాడు కూడా షమీ అంత పట్టుదలతో దేశవాళీ క్రికెట్ ఆడలేదు. డొమెస్టిక్ క్రికెట్‌లో అతడు అద్భుతంగా రాణిస్తున్నప్పటికి సెలెక్టర్లు ఎంపిక చేయకపోవడం నిజంగా సిగ్గు చేటు అని రేవ్‌స్పోర్ట్‌స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శుక్లా పేర్కొన్నాడు. షమీ ప్రస్తుతం దేశవాళీ క్రికెట్‌లో సీజన్‌లో దుమ్ములేపుతున్నాడు.

రంజీ ట్రోఫీ 202526లో బెంగాల్ తరపున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా కొనసాగుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ, విజయ్ హజారే ట్రోఫీలోన అతడు అదరగొట్టాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు దాదాపు 45 వికెట్లు పడగొట్టి తన సత్తా చాటాడు.

అయితే షమీ ఫామ్ లేదా ఫిట్‌నెస్ విషయంలో ఎలాంటి సమస్యలు లేవు. 2027 వన్డే ప్రపంచకప్ సమయానికి హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ లాంటి బౌలర్లను సిద్ధం చేయాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ క్రమంలోనే షమీకి అవకాశమివ్వడం లేదని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడతున్నారు.

న్యూజిలాండ్ వన్డేలకు భారత జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కె.ఎల్. రాహుల్ (కీపర్), శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసీద్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

# న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన.. స్టార్ ప్లేయర్ వచ్చేశాడు

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం ప్రకటించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఆస్ట్రేలియా పర్యటనలో గాయపడ్డ వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా జట్టులోకి తిరిగొచ్చారు. అయితే అయ్యర్ ఇంకా బీసీసీఐ వైద్యబృందం నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందాల్సింది.

జనవరి 6 న విజయ్ హజారే ట్రోఫీలో ముంబై తరపున శ్రేయస్ ఆడనున్నాడు. దీంతో అతడు ఫిట్‌నెస్ లెవల్స్ వైద్యులు అంచనా వేయనున్నారు. అతడు ఎటువంటి సమస్య లేకుండా ఆడితే కివీస్‌తో వన్డే సిరీస్‌లో కూడా భాగం కానున్నాడు. ఒకవేళ ఈ ముంబై బ్యాటర్‌కు ఏదైనా సమస్య తలెత్తితే తిరిగి బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లనున్నాడు.

**రుతురాజ్‌పై వేటు..**

ఇక అయ్యర్ రీ ఎంట్రీతో మహారాష్ట్ర కెప్టెన్, స్టార్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్‌పై వేటు పడింది. సౌతాఫ్రికాతో సిరీస్‌లో గైక్వాడ్ అద్భుతమైన సెంచరీతో సత్తాచాటినప్పటికి.. జట్టు కూర్పు దృష్ట్యా అతడిని సెలక్టర్లు పక్కన పెట్టాల్సి వచ్చింది. ఇక టీ20 ప్రపంచకప్2026ను దృష్టిలో ఉంచుకుని జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాలకు ఈ సిరీస్ నుండి విశ్రాంతి ఇచ్చారు. దీంతో మహ్మద్ సిరాజ్ తిరిగి జట్టులోకి వచ్చాడు. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాలతో కూడిన పేస్ దళాన్ని సిరాజ్ లీడ్ చేయనున్నాడు.

**షమీకి నో ఛాన్స్..**

ఇక దేశవాళీ క్రికెట్‌లో దుమ్ములేపుతున్న వెటరన్ పేసర్ మహ్మద్ షమీకి సెలక్టర్లు మరోసారి మొండి చేయి చూపించారు. అతడిని కివీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేయనున్నారని వార్తలు వచ్చినప్పటికి.. సెలక్టర్లు మాత్రం మొగ్గు చూపలేదు. షమీ గతేడాది మార్చి నుంచి భారత జట్టుకు దూరంగా ఉంటున్నాడు.

**పంత్‌కే ఓటు..**

అదేవిధంగా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను వన్డే జట్టు నుంచి తప్పించనున్నారని వార్తలకు సెలక్టర్లు చెక్ పెట్టారు. కివీస్‌తో వన్డే సిరీస్‌కు పంత్‌ను ఎంపిక చేశారు. అతడిని తప్పించి ఇషాన్ కిషన్‌కు చోటు ఇస్తారని జోరుగా



ప్రచారం జరిగింది. కానీ అజిత్ అగార్కర్ అండ్ కో మాత్రం పంత్‌కే ఓటేశారు. కేఎల్ రాహుల్ బ్యాకప్‌గా పంత్ ఉండనున్నాడు. హార్దిక్ పాండ్యా గైర్హాజరీలో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి చోటు దక్కింది. ఇక కివీస్‌భారత్ మధ్య మూడు వన్డేల సిరీస్ జనవరి 11 నుంచి ప్రారంభం కానుంది.

**కివీస్‌తో వన్డేలకు భారత జట్టు**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (ఫిట్‌నెస్‌కు లోబడి)*, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్‌కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, జైశ్వాల్, అర్ష్‌దీప్



# టాప్స్‌లో జ్యోతి సురేఖ

న్యూఢిల్లీ: టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్)లో కొత్తగా కాంపౌండ్ ఆర్చర్లను చేర్చారు. దీంతో ఎన్నో ఏళ్లుగా అంతర్జాతీయ ఆర్చరీ పోటీల్లో భారత్‌కు పతకాలు తెచ్చిపెడుతున్న తెలుగుతేజం, ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖకు ఇది కొత్త ఉత్సాహం ఇవ్వనుంది. భారత్ నుంచి ఒలింపిక్ పతక విజేతలను తయారు చేయడమే లక్ష్యంగా కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ 'టాప్స్' ద్వారా చేయూత ఇస్తోంది.

అయితే ఇన్నాళ్లు ఒలింపిక్ క్రీడాంశాలకే 'టాప్స్'ను అమలు చేస్తూ వచ్చారు. దీంతో ఒలింపిక్స్‌లో లేని కాంపౌండ్ కేటగిరీకి 'టాప్స్'ను ఇవ్వడం లేదు. దీనివల్ల ప్రపంచ ఆర్చరీ పోటీల్లో దేశానికి, రాష్ట్రానికి పతక ప్రతిష్టలు తెస్తున్న జ్యోతి సురేఖ, పర్‌నీత్ కౌర్, అభిక్ వర్మలాంటి వారు దూరమయ్యారు. తాజాగా క్రీడామంత్రిత్వ శాఖ నిర్ణయంతో ఒలింపిక్ ఈవెంట్‌తో సంబంధం లేకపోయినా 8 మంది కాంపౌండ్ ఆర్చర్లకు లబ్ధి చేకూరనుంది.

మరో తెలుగుతేజం రికర్వ్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర ఇప్పటికే ఈ పథకంలో ఉన్నాడు. డోపింగ్‌లో పట్టుబడిన మహిళా రెజ్లర్ రితిక హుడాను 'టాప్స్' నుంచి తొలగించారు. 2024-పారిస్ ఒలింపిక్స్ కోసం 179 మందికి 'టాప్స్'ను అమలు చేశారు. ప్రదర్శన, వైఫల్యం, డోపింగ్ కారణాలతో గతేడాది నాటికి 179 జాబితా కాస్తా 94 మందికి పడిపోయింది. ఈ ఏడాది మొదలవుతుండగానే 'టాప్స్' కోర్ గ్రూప్ జాబితాను 118 మందికి పెంచారు.

ఇందులో 57 మంది అథ్లెట్లు కాగా, మరో 61 మంది పారాథ్లెట్లు ఉన్నారు. క్రీడాశాఖ ప్రత్యేక డెవలప్‌మెంట్ గ్రూప్ జాబితాలో అథ్లెట్లు అనిమేశ్ కుజుర్ (200 మీ. పరుగు), తేజస్విన్ శంకర్ (డెకథ్లాన్), 4-400 మీ. రిలే జట్టు సభ్యులు విశాల్, జయ్ కుమార్, రాజేశ్ రమేశ్, అమోజ్ జాకబ్, మొహమ్మద్ అజ్మల్, సంతోష్ కుమార్‌లు ఉన్నారు. ఈ గ్రూప్‌లోనే టేబుల్ టెన్నిస్ ప్లేయర్లు మానుశ్ షా, మానవ్ ఠక్కర్, దియా చిటాలేలకు చోటుదక్కింది.

**'టాగ్'లో కొత్తగా గోల్ఫ్, సర్ఫింగ్**

టార్గెట్ ఆసియా క్రీడల గ్రూప్ (టీఏజీజీ-టాగ్)లో కొత్తగా లబ్ధిపొందే క్రీడాంశాలను పెంచారు. 'టాప్స్'లో లేని గోల్ఫ్, సర్ఫింగ్, టెన్నిస్ క్రీడాకారులకు 'టాగ్' కింద చేయూత అందిస్తారు. ఈ ఏడాది జపాన్‌లో ఏషియాడ్ జరుగనుంది. ఈ ఆసియా క్రీడల్లో పతకాలు తేవాలనే ఉద్దేశంతో గోల్ఫర్లు శుభాంకర్ శర్మ, దీక్ష డాగర్, టెన్నిస్ ప్లేయర్లు సుమిత్ నగాల్, యూకీ బాంబ్రీ, మాయ రాజేశ్వరన్ సహా 48 మందిని 'టాగ్' పథకం కింద ఎంపిక చేశారు.

ఇందులో ఇప్పటికే ఈక్వెస్ట్రియన్స్ (గుర్రపుస్వారీ) ఫౌద్ మీర్జా, అనుశ్ అగర్‌వాలా, ఫెన్సర్ భవానీ దేవి, జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ తదితరులు ఉన్నారు. 'టాప్స్', 'టాగ్' పథకాల కింద కోచింగ్, ఇతరాత్ర ఖర్చుల కింద నెలకు రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తారు. అవసరమైతే మరో రూ. 25 వేలు పాకెట్ అలవెన్స్‌గా అందజేస్తారు. అలాగే విదేశీ శిక్షణలో ఉన్నన్ని రోజులు రోజుకు రూ. 2250 (25 డాలర్లు) అదనంగా ఇస్తారు. అయితే విదేశీ శిక్షణకు ముందుగా ఆమోదం పొందాల్సివుంటుంది.